బడిలో కిచెన్ గార్డెన్..!

● పాఠ్యాంశాన్ని ఆచరణలో పెడుతున్న బ్రాహ్మణతర్లా విద్యార్థులు
● ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు


కిచెన్ గార్డెన్‌లో కలుపు తీస్తున్న విద్యార్థులు

పలాస: విద్యార్థులకు పోషకాహారంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. పాఠ్యాంశాన్ని ఆచరణలో పెట్టి పాఠశాల ఆవరణలోనే కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఖాళీ స్థలాన్ని ఎంచుకొని అందులో కిచెన్‌గార్డెన్ (బడి తోట) పేరుతో వివిధ కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఎనిమిదో తరగతిలో 'పంట ఉత్పత్తి–నిర్వహణ' అనే పాఠ్యాంశంలో నేర్చుకున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో ఆచరిస్తూ ప్రత్యక్ష జ్ఞానం పొందుతున్నారు. అందుకు ఉపాధ్యాయులు కూడా తగిన ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఫలితంగా మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాలతో కూడిన ఆకు కూరలు, కూరగాయలు అందిస్తున్నారు. పాఠశాలలోని హరిత క్లబ్ ఆధ్వర్యంలో పోషకాహార బడి తోటను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, ఎన్జీసీ క్లస్టర్ సమన్వయకర్త, సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, విద్యార్థుల నిర్వహణలో బడితోట రూపుదిద్దుకుంది. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మట్టి వేసి సేంద్రియ ఎరువులతో తోటకూర, పాలకూర, గోంగూర, ముల్లంగి, వంకాయలు, బెండకాయలు, మిర్చి తదితర పంటలను పండిస్తున్నారు. వీటిని మధ్యాహ్నం భోజనంలో వినియోగిస్తున్నారు. ఈ విధంగా వీటిని పండిస్తున్నందుకు కిచెన్ గార్డెన్ సాగుకు ఈ ఏడాది ప్రభుత్వం కూడా రూ.5 వేలు నిర్వహణ ఖర్చులకు ఇచ్చిందని ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణరావు తెలిపారు. పిల్లల ఆకలి తీర్చడమే కాకుండా శారీరక, మానసిక వృద్ధిలో పోషకాల ప్రాధాన్యతను కూడా గుర్తించి ఈ విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. వేసవి సెలవుల్లో కూడా బడితోట పాడవ్వకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

ఆహారమే తొలి ఔషధం



మనం తినే ఆహారంలో 34 రకాల పోషకాలు ఉంటాయి. అందుకే ఆహారాన్ని మొదటి ఔషధం అన్నారు. ప్రస్తుతం ఉపయోగించే హానికర రసాయనాలతో మూడో వంతు పోషకాలు తగ్గిపోయి విద్యార్థుల్లో పోషకాహార లోపం ఏర్పడి అనారోగ్యానికి గురవుతున్నారు. అందుకే సేంద్రియ పద్ధతిలో పోషకాహార తోటలో కూరగాయలు పెంచడం వల్ల ఈ సమస్యను అధిగమించవచ్చు. జీరో బడ్జెటు నేచరల్ ఫార్మింగ్ (సేంద్రియ సాగు)పై గతంలో అమరావతిలో శిక్షణ పొందాను. విద్యార్థుల ద్వారా వీటిని చేపట్టి మంచి ఫలితాలు పొందుతున్నాం.

– కొయ్యల శ్రీనివాసరావు, ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్, బ్రాహ్మణతర్లా హైస్కూల్

సేంద్రియ సాగుపై విద్యార్థులకు అవగాహన



సేంద్రియ సాగుపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నాం. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా క్షేత్రస్థాయి పరిజ్ఞానాన్ని పెంచుతున్నాం. గతంలో ఇళ్ల చుట్టూ ఖాళీ స్థలాలు ఉండేవి. అక్కడ మట్టి ఉండటం వల్ల కాయగూరలు పెంచుకునే వారు. ఇప్పుడు అన్ని కాంక్రీటు ఇళ్లు, వీధులు వల్ల మట్టి ఉండటం లేదు. గతంలా ఇంటి వద్ద పెంచుకునే విధానం రావాలంటే మిద్దె వ్యవసాయం కూడా అవసరం ఏర్పడింది. అందుకు విద్యార్థులకు వీటిపై అవగాహన అవసరం ఉంది.

– ఎస్వీ రమణరావు, ప్రధానోపాధ్యాయులు, బ్రాహ్మణతర్లా హైస్కూల్

విరామ సమయంలో తోట పని



పాఠశాలలో విరామ సమయంలో తోట పని చేస్తున్నాము. మంచి కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నాం. పిల్లలు వీటిని ఇష్టంగా తింటున్నారు. వేసవి సెలవుల్లో బడితోట పాడవ్వకుండా నీటిని అందిస్తున్నాం.

– మద్దిల ప్రవీణ్, 9వ తరగతి విద్యార్థి

మున్సిపల్ కార్మికుల ధర్నా


నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇచ్ఛాపురం: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్‌కోడ్లను రద్దు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మున్సిపల్ మస్టర్ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉద్యోగ విధానంలో ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం ద్వారా ఉద్యోగ భద్రతలేకుండా కార్మికులను కట్టు బానిసలుగా మార్చేస్తున్నారన్నారు. అలాగే రాష్ట్రంలో ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేటు ఏజన్సీలకు అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కార్మిక సంఘ నాయకులు రమేష్‌పట్నాయక్, లిమ్మాయి, లక్ష్మణ్, మంగళసత్తు, గంగాధరథ్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అదనపు ఆదాయం


నవధాన్యాల కిట్ల తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కంచిలి: సేంద్రియ పద్ధతిలో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయరావు అన్నారు. అంపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆదేశాల మేరకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పీఎండీఎస్ నవధాన్యాలు కిట్లు తయారీ, పంపిణీ చేసే ప్రక్రియను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాల సాగుతో భూమి సారవంతమై సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ప్రధాన పంటకు అవసరమైన 59 రకాల పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు శివాజీ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి టి.శివానందం, ఐసీఆర్‌పీలు రేవతి, మీనా, పుష్ప, భవాని, రోహిణి, శ్రీదేవి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


పరామర్శలో దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: డోలగోవిందపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొంగా బిసాయి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బిసాయి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్‌కుమార్ ఉన్నారు.

అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చిన్నారుల కోసం నిర్వహిస్తున్న అథ్లెటిక్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు బి.నారాయణరావు, కె.రఘునాథరావు కోరారు. ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 94924 17570 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చెరువు గర్భంలో గృహ నిర్మాణం!

● తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు
● ఆపలేకపోయిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు


ఎర్రచెరువు గర్భంలో చీరలు కట్టి స్థల అక్రమణ

కాశీబుగ్గ: చెరువు గర్భాన్ని ఆక్రమించేసి గృహాన్ని నిర్మించేస్తున్నారు. అయితే దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు పురుషోత్తపురం పరిధిలో ఉన్న ఎర్రచెరువు గర్భంలో జరుగుతున్న ఇంటి నిర్మాణం చర్చనీయంగా మారింది. సర్వేనంబర్ 29లో ఉన్న ఎర్రచెరువు 20 అడుగుల లోతులో ఉంది. అంతే ఎత్తులో మట్టినిపోసి ఏకంగా పునాదు వేసి ఇంటి పనులు చేపడుతుండడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చెరువులో మట్టి పోసి ఇల్లు కట్టడాన్ని గమనించిన స్థానికులు పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లారు. 20 ఏళ్ల క్రితం చెరువు సరిహద్దుకు మార్కింగ్ ఇచ్చి సరిహద్దు గోడ నిర్మించినప్పటికీ దాన్ని దాటుకుని అక్రమించి నిర్మాణం మొదలుపెట్టారు. మార్కెట్ విలువ సుమారు రూ. 30 లక్షలు ఉండే ఈ స్థలంలో చోటా నాయకులు కలగజేసుకుని ఎవ్వరికీ కనిపించకుండా చీరలను అడ్డుగా కట్టి నిర్మాణాలు మొదలెట్టేశారు. ఎటువంటి పట్టాలు, టౌన్ ప్లానింగ్ అనుమతులు, ప్లాన్‌లు లేవనే విషయం అధికారులకు చేరింది. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పలాస రెవెన్యూ అధికారులు సచివాలయ ఉద్యోగులు రెండు బృందాలుగా అక్రమ నిర్మాణాన్ని ఇటీవల పరిశీలించినప్పటికీ నిలువరించలేకపోయారు. ప్రస్తుతం అక్రమణదారులు, ఫిర్యాదుదారులతో పలాస తహసీల్దార్ కార్యాలయంలో చర్చలు జరుగుతున్నట్టు తెలిసింది.

రెండు రోజుల్లో కూల్చేస్తాం..

చెరువు గర్భంలో జరుగుతున్న నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బందితో పరిశీలిస్తామని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి చెప్పారు. ఆక్రమణ విషయాన్ని ఆయన వద్ద ప్రస్తావించగా.. రెండు రోజుల్లో నిర్మాణాన్ని కూల్చివేస్తామని స్పష్టం చేశారు.


పిల్లర్లు, పునాదులు వేసిన ఇంటి నిర్మాణం


పనులు ఆపడానికి వచ్చిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు (ఫైల్)


తనిఖీ చేయడానికి వచ్చిన రెవెన్యూ అధికారులు (ఫైల్)

క్లుప్తంగా

ఉత్సవాలకు అధికారులు సహకరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు గ్రామస్తులకు సహాయ సహకారాలు అందజేయాలని ఎమ్మెల్యే బి.అశోక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఉప్పలాం పంచాయతీలో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బేసిరామచంద్రాపురం, ఉప్పలాం, కర్తలిపాలేం, పాలవలస, కొర్లాం గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అధికారులు సహకరించాలన్నారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీవో బి.ఈశ్వరమ్మ, సీఐ బి.మంగరాజు, ఎస్సై హరిబాబునాయుడు, కూటమినేతలు సూరాడ చంద్రమోహన్, జి.కె.నాయుడు పాల్గొన్నారు.

లెఫ్టినెంట్‌కు సత్కారం


వేణు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: రైతు కుటుంబంలో పుట్టి ఉన్నతస్థాయిలో స్థిరపడాలనే లక్ష్యంతో ముందుకుసాగి విజయవంతంగా లెఫ్టినెంట్ హోదా పొందిన దుద్ది వేణు పట్టుదల నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని శ్రీశయన చైతన్యదీపిక సంఘం ప్రతినిధులు అన్నారు. గొండ్యాలపుట్టుగ గ్రామానికి చెందిన వేణు నేవీ లెఫ్టినెంట్‌గా ఇటీవల పదోన్నతిపొంది స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో వేణు దంపతులను దుశ్శాలువతో మంగళవారం సత్కరించి అభినందించారు. సన్మాన గ్రహీత వేణు మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకుంటూనే ఈస్థాయికి చేరుకున్నట్టు చెప్పారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి రామకృష్ణాపురం లేఅవుట్‌లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమినిటీ కార్యదర్శులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ లేఅవుట్‌లో 1963 ఇళ్లకు 1407 మాత్రమే పూర్తికావడంతో జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ఇళ్ల నిర్మాణాలపై దృష్టిసారించాలని సూచించారు.

ఘనంగా చింతామణి సంబరం


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామంలో మంగళవారం ఘనంగా చింతామణి అమ్మవారి ఉత్సవం ఘనంగా జరిగింది. డొంకూరు సన్నాయి మేళం, కవిటి కాళీ వేషధారణతో భక్తులు గజముద్దను పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం మేళతాళాలతో కవిటి చింతామణి అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు.

రేషన్ కోసం ఎదురు చూపులు!


రేషన్ డిపో వద్ద మాట్లాడుతున్న సర్పంచ్ సుమన్

కంచిలి: పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మే నెలకు సంబంధించి రేషన్ సరుకులను ఇప్పటి వరకూ పంపిణీ చేయలేదు. దీంతో 693 మంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మే నెల ప్రారంభమై ఆరు రోజులు దాటినప్పటికీ సరుకులను పంపిణీ చేయకపోవడంతో వీటిపై ఆధారపడుతున్న కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నారు. అధికారులు తక్షణమే రేషన్ సరుకులను పంపిణీ చేయాలని స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్ కోరారు. రేషన్ డిపో వద్ద మంగళవారం ఆయన మాట్లాడారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డెమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో నాలుగు నెలల పాటు శిక్షణ అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై.. ఆసక్తి ఉన్న వారు ఈ నెల తొమ్మిదో తేదీలోగా శిక్షణలో చేరాలన్నారు.

ముగిసిన ఉత్సవం



వజ్రపుకొత్తూరు మండలంలోని దేవునల్తాడ గ్రామంలో మూడు రోజులుగా జరిగిన నీలమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున పగటి వేషాలు, కర్ర సాము, బిందెల నృత్యం, వివిధ జానపద, హాస్య ఘట్టాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగ్రామం కావడంతో ఆయన కర్ర సాము కళాకారులతో చేసిన నృత్యం అలరించింది. గ్రామ దేవత ఉత్సవాలు ఐకమత్యానికి ప్రతీక అని అప్పరాజు అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సొదాల వెంకన్న పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు

నూతన కార్యవర్గం



సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది.. అధ్యక్షులుగా మామిడి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా లబ్బ రుద్రయ్య, కోశాధికారిగా గొరకల లోకేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కుమార్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దాసరి తాతారావు, వ్యవస్థాపకులుగా మల్లేన దేవరాజులు ఎన్నికైయ్యారు.

–కాశీబుగ్గ

దిష్టిబొమ్మలా నీటి పథకం!



కంచిలి మండలం మండపల్లి పంచాయతీ పరిధి ఒరియా నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకం ట్యాంకు పనిచేయడం లేదు. సుమారు ఏడాదిగా నీరు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ఈ పథకాలకు నీరందించే మదర్ ప్లాంట్ కూడా ఈ గ్రామంలోనే ఉన్నప్పటికీ ఇక్కడ నీటి సరఫరా లేకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు ఈ పథకం ద్వారా నీరందించాలని స్థానికులు కోరుతున్నారు.

– కంచిలి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


ప్రభుత్వ భూమిలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 197 సర్వే నంబర్‌లోని కొండపై ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని మంగళవారం తెలిపారు. కొంత మంది తప్పుడుపట్టాలు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్టు పేర్కొన్నారు. ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

టెక్కలి: భూసారం పెంచడానికి, కలుపు నివారణకు పచ్చిరొట్ట విత్తనాలను వేసుకోవాలని టెక్కలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు. కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు గ్రామంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావుతో కలిసి రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 50 శాతం రాయితీపై విత్తనాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ జి.గురునాథ్ పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లను విస్మరించిన ప్రభుత్వం


కంచరాన చిన్నబాబు

కాశీబుగ్గ: ఉద్యోగులు, పెన్షనర్లను కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం ఉద్యోగ, పెన్షనర్ల అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు అనేక హామీలిచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడం మరిచిపోవడం దారుణమన్నారు. ఉద్యోగులకు అన్ని రకాల బకాయిలు కలిపి రూ.30 వేల కోట్లు బకాయి ఉండగా కేవలం రూ.7, 300 కోట్లే మంజూరు చేసి ఆర్థిక ఇబ్బందులు పేరిట కాలయాపన చేయడం సరికాదన్నారు. సీపీఎస్‌ను ఎప్పుడు రద్దు చేస్తారోనని మూడు లక్షల మంది ఉద్యోగ కుటుంబాలు ఎదురు చూస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో వచ్చి ఒక్క రూపాయి ఆర్థిక ప్రయోజనాన్ని ఉద్యోగులు పొందలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వాలని కోరారు.

రూ. 60 వేల ఆర్థికసాయం


సాయాన్ని అందజేస్తున్న సంఘం సభ్యులు

కాశీబుగ్గ: పలాస మండలం గురుదాసుపురం గ్రామానికి చెందిన బూరగాపు సూర్యం బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అండగా నిలిచారు. రూ. 60,800 సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి మంగళవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. సంఘం జిల్లా అధ్యక్షులు సింహాద్రి ధనుంజయ ఆచారి, నాయకులు కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటల పోటీలు

మందస: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మందసలోని గ్రంథాలయంలో మంగళవారం పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం డబార్ గ్రామానికి చెందిన పోస్టల్ మాస్టర్ టి.జయరాం పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలపై పిల్లలకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.